సాక్షి నాగర్‌కర్నూల్

ఆదివారం । 5 । అక్టోబర్ । 2025



జూరాలకు భారీ వరద

ఎగువన కురుస్తున్న వర్షాలతో జూరాల ప్రాజెక్టుకు 2,32,000 క్యూసెక్కుల వరద ప్రవాహం కొనసాగుతుంది.

-8లో ▸



తిరుగు ప్రయాణ పాట్లు

దసరా సెలవులు ముగియడంతో స్వగ్రామాల నుంచి తిరిగి పట్నం బాట పట్టడంతో బస్సులు కిక్కిరిసి ప్రయాణిస్తున్నాయి.

-8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 33.9 /21.5

ఉదయం, సాయంత్రం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తేలికపాటి జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఓపెన్ డిగ్రీలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

కందనూలు: డాక్టర్ బీఆర్ **అంబేడ్కర్ ఓపెన్** డిగ్రీలో ప్రవేశం కోసం ఈ నెల **10వ తేదీలోగా** దరఖాస్తు చేసుకోవాలని **నాగర్‌కర్నూల్** ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల **ప్రిన్సిపాల్ మద** న్మోహన్, అంబేడ్కర్ సార్వత్రిక **విశ్వవిద్యా** లయం అధ్యయన కేంద్రం సమన్వయకర్త ఎం .అంజయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, ఐటీఐ లేదా ఇతర డిప్లొమా కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులు అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా డిగ్రీ కోర్సులకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు 10వ తరగతి, ఇంటర్ మెమో లేదా ఇతర అర్హతల సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, కుల ధ్రువపత్రం, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అదే విధంగా 2వ, 3వ సంవత్సరం విద్యార్థులు అడ్మిషన్ ఫీజు చెల్లించాలన్నారు. పూర్తి వివరాలకు 73829 29779 నంబర్ లేదా డిగ్రీ కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

శనేశ్వరుడికి తైలాభిషేకాలు



బిజినేపల్లి: మండలంలోని నందివడ్డేమాన్ జ్యేష్ఠాదేవి సమేత శనేశ్వరాలయానికి శనివారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తమ ఏలినాటి శనిదోష నివారణ కోసం శనేశ్వరుడికి తిల తైలాభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు గవ్వమఠం విశ్వనాథ శాస్త్రీ, అర్చకులు శాంతికుమార్, ఉమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల ‘చలో హైదరాబాద్’

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల హయ్యర్ పెన్షన్ సమస్యల పరిష్కారానికి సోమవారం హైదరాబాద్‌లోని భర్కత్‌పుర పీఎఫ్ కార్యాలయం ఎదుట మహాధర్నా చేపట్టేందుకు చలో హైదరాబాద్ కార్యక్రమం తలపెట్టినట్లు ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ ఫోరం జిల్లా అధ్యక్షుడు రాజసింహుడు, ఉపాధ్యక్షులు జీబీ పాల్, భగవంతు తెలిపారు. శనివారం స్థానిక ఫోరం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పీఎఫ్ కార్యాలయం నుంచి వచ్చిన డిమాండ్ లేఖలపై అనేక మంది విశ్రాంత ఉద్యోగులు గతేడాది నుంచి హయ్యర్ పెన్షన్ మంజూరుకు రూ.లక్షలు డీడీల రూపంలో చెల్లించినా ఇంత వరకు పెన్షన్ మంజూరు చేయలేదన్నారు. అనేక మంది విశ్రాంత ఉద్యోగులకు ఇంత వరకు డిమాండ్ లేఖలను కూడా పంపలేదని, ఇంకొందరికి హయ్యర్ పెన్షన్ ఏరియర్స్ చెల్లించలేదని ఆరోపించారు. పెన్షనర్ల సమస్యల పట్ల కేంద్ర ప్రావిడెంట్ ఫండ్ కార్యాలయ అధికారులు పూర్తిగా నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తున్నారని దుయ్యబట్టారు. వెంటనే తమ సమస్యలను పరిష్కరించాలని లేకపోతే ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో నారాయణ, నాగాంజనేయులు, అంజన్న, నర్సింహులు, బీహెచ్ కుమార్, సలీం, రియాజొద్దీన్, డేవిడ్, లలితమ్మ, చక్రధర్ పాల్గొన్నారు.

బీసీ జోష్..!

42 శాతం రిజర్వేషన్లతో వెనుకబడిన వర్గాల్లో ఉత్సాహం

- గత స్థానిక ఎన్నికలతో పోలిస్తే 20 శాతం అధికం
- 2019లో జనరల్ స్థానాల్లోనూ వారిదే హవా
- జెడ్పీటీసీ స్థానాలు మాత్రమే ఆశాజనకం
- రాజకీయ పార్టీల్లో కుల సంఘాలకు పెరిగిన ప్రాధాన్యం



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: స్థానిక సంస్థల ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ ద్వారా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించడంతో ఆ వర్గంలో జోష్ నెలకొంది. గత ఎన్నికలతో పోలిస్తే 20 శాతం మేర ప్రాతినిధ్యం పెరగనుండడంతో వారిలో ఉత్సాహం వెల్లివిరుస్తోంది. వార్డు, సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ బరిలో నిలిచేందుకు తమ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. 2019 స్థానిక ఎన్నికల్లో వెనుకబడిన వర్గాలకు 22 శాతం రిజర్వేషన్ కల్పించగా.. ఆ ఎన్నికల్లో బీసీలు సత్తా చాటడంతోపాటు జనరల్ స్థానాల్లోనూ బరిలో నిలిచి విజయం సాధించారు. తాజాగా బీసీ రిజర్వేషన్ల పెంపుతో రాజకీయ పార్టీల్లో కుల సంఘాలకు మరింత ప్రాధాన్యం పెరిగింది.

జనరల్ స్థానాల్లోనూ హవా..

గత ఎన్నికల్లో ఉమ్మడి పాలమూరులోని మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, నారాయణపేట, వనపర్తి, జోగుళాంబ గద్వాల జిల్లాల్లో 1,690 సర్పంచ్ స్థానాలు ఉండగా.. 406 బీసీ రిజర్వ్ అయ్యాయి. వీటితోపాటు మరో 238 జనరల్ స్థానాల్లోనూ వెనుకబడిన వర్గాలకు చెందిన నాయకులు విజయం సాధించారు. అంటే మొత్తంగా 644 మంది బీసీలు సర్పంచ్‌లుగా గెలుపొందారు.

■ 2019 స్థానిక ఎన్నికల లెక్కల ప్రకారం ఉమ్మడి జిల్లాలో మొత్తం 788 ఎంపీటీసీ స్థానాలు కాగా.. ఇందులో 217 స్థానాలను బీసీలకు కేటాయించారు. వీటితోపాటు మరో 125 జనరల్ స్థానాల్లోనూ బీసీలు సత్తా చాటారు. మొత్తంగా 342 మంది బీసీలు ఎంపీటీసీ సభ్యులుగా విజయం సాధించారు.

■ గత ఎన్నికల్లో మొత్తం 71 జెడ్పీటీసీ స్థానాల్లో 20 వెనుకబడిన వర్గాలకు రిజర్వ్ అయ్యాయి. వీటితో పాటు మరో ఆరు జనరల్ స్థానాల్లోనూ బీసీలు గెలుపొందారు. మొత్తంగా 26 మంది బీసీ నాయకులు జెడ్పీటీసీ సభ్యులుగా ఎన్నికయ్యారు.

జెడ్పీటీసీ స్థానాల్లో మాత్రమే..

2019 స్థానిక ఎన్నికల్లో గెలుపొందిన బీసీలు, ప్రస్తుత ఎన్నికల్లో ఆ వర్గానికి రిజర్వేషన్లను పరిశీలిస్తే సర్పంచ్, ఎంపీటీసీల మధ్య పెద్దగా తేడా లేదు. గత ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో 644 మంది బీసీలు సర్పంచ్‌లుగా ఎన్నిక కాగా.. ప్రస్తుత ఎన్నికల్లో 621 స్థానాలు మాత్రమే ఆ వర్గానికి రిజర్వ్ అయ్యాయి. గత ఎంపీటీసీ ఎన్నికల్లో మొత్తంగా 342 మంది బీసీలు విజయం సాధించగా.. ఈసారి ఆ వర్గానికి 341 స్థానాలు రిజర్వ్ అయ్యాయి. జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి మాత్రం రిజర్వేషన్లు బీసీలకు కలిసివచ్చాయి. గత ఎన్నికల్లో రిజర్వ్ అయిన వాటితోపాటు జనరల్ స్థానాల్లో పోటీ చేసి గెలుపొందిన బీసీల లెక్క (మొత్తం 26 స్థానాలు)తో పోలిస్తే.. ఈసారి కేటాయించిన రిజర్వేషన్ ప్రకారం మరో ఏడు స్థానాల్లోనూ ఆ వర్గాల ప్రాతినిధ్యం పెరగనుంది. మొత్తంగా గత జెడ్పీటీసీ ఎన్నికల్లో బీసీలకు 20 స్థానాలు రిజర్వ్ కాగా.. ఈసారి 33 స్థానాలను కేటాయించారు. ఈ లెక్కన 13 స్థానాలు పెరిగాయి.

కుల సంఘాలకు బాధ్యతలు..

బీసీ రిజర్వేషన్లపై ఈ నెల 8న హైకోర్టులో విచారణ జరగనుంది. హైకోర్టు తీర్పు ఎలా వస్తుందనే అంశంపై ఉత్కంఠతోపాటు సందిగ్ధం నెలకొన్నా.. గెలుపే లక్ష్యంగా అభ్యర్థుల ఎంపికపై ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు కసరత్తు ముమ్మరం చేశాయి. అయితే బీసీ రిజర్వ్‌డ్ స్థానాల్లో ఆశావహులు అధిక సంఖ్యలో ఉండడం.. తగ్గిన అన్ రిజర్వ్‌డ్ (జనరల్) స్థానాల్లో అభ్యర్థిత్వాల కోసం ఆయా వర్గాలకు చెందిన వారు పోటీ పడుతున్నారు. ప్రధానంగా అధికార కాంగ్రెస్‌లో ఈ పరిస్థితి నెలకొంది. గ్రామాలు, మండలాల వారీగా ఆశావహులు ఆయా నియోజకవర్గాల్లోని ముఖ్య నేతల వద్దకు క్యూ కడుతున్నారు. ఈ క్రమంలో కుల సంఘాలకు ప్రాధాన్యం పెరిగినట్లు తెలుస్తోంది. తుది నిర్ణయం పార్టీదే అయినప్పటికీ.. రిజర్వేషన్లకు అనుగుణంగా పలు ప్రాంతాల్లో గెలుపొందే అభ్యర్థుల వడపోత బాధ్యతలను పలు నియోజకవర్గాల్లోని ముఖ్య నేతలు తమకు అనుకూలంగా ఉన్న కుల సంఘాల నాయకులకు అప్పగించినట్లు సమాచారం.

గత, ప్రస్తుత బీసీ రిజర్వేషన్లలో పెరుగుదల..

జిల్లా	సర్పంచ్‌లు			ఎంపీటీసీ స్థానాలు			జెడ్పీటీసీ స్థానాలు		
	2019	2025	పెరిగినవి	2019	2025	పెరిగినవి	2019	2025	పెరిగినవి
మహబూబ్‌నగర్	97	147	50	35	74	39	3	7	4
నాగర్‌కర్నూల్	83	152	69	49	90	41	3	8	5
నారాయణపేట	84	103	19	52	59	7	4	6	2
వనపర్తి	62	113	51	37	56	19	5	6	1
జోగుళాంబ గద్వాల	80	106	26	44	62	18	5	6	1

జిల్లాల వారీగా 2019 సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో ఇలా..

జిల్లా	మొత్తం స్థానాలు			బీసీ రిజర్వ్‌డ్ స్థానాలు			జనరల్ స్థానాల్లో గెలిచిన బీసీలు			మొత్తం బీసీలు గెలిచిన స్థానాలు		
	జీపీలు	ఎంపీటీసీ	జెడ్పీటీసీ	జీపీలు	ఎంపీటీసీ	జెడ్పీటీసీ	జీపీలు	ఎంపీటీసీ	జెడ్పీటీసీ	జీపీలు	ఎంపీటీసీ	జెడ్పీటీసీ
మహబూబ్‌నగర్	439	169	14	97	35	3	61	30	-	158	65	3
నాగర్‌కర్నూల్	461	210	20	83	49	3	37	21	4	120	70	7
నారాయణపేట	280	140	11	84	52	4	47	24	1	131	76	5
వనపర్తి	255	128	14	62	37	5	38	20	-	100	57	5
జోగుళాంబ గద్వాల	255	141	12	80	44	5	55	30	1	135	74	6

మార్కెట్ల నిర్మాణమెప్పుడో?

జిల్లాలో ఏళ్ల తరబడి కాలయాపన



కొల్లాపూర్‌లో రోడ్డుపైనే కొనసాగుతున్న కూరగాయల విక్రయాలు

- నాలుగు మున్సిపాలిటీల్లో కలగా మారిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్లు
- గతంలోనే నిధులు మంజూరుచేసిన మున్సిపల్, మార్కెటింగ్ శాఖలు
- స్థలాల గుర్తింపు ప్రక్రియ కూడా పూర్తి

కొల్లాపూర్: జిల్లాలోని ప్రధాన పట్టణాల్లో వారాంతపు సంతలు నేటికీ రోడ్లపైనే సాగుతున్నాయి. మున్సిపాలిటీల్లో కల్పించే మౌలిక సదుపాయాల్లో భాగమైన ఇంటిగ్రేటెడ్ మోడ్రన్ మార్కెట్లకు ప్రజలు నోచుకోవడం లేదు. మార్కెట్ల నిర్మాణాల కోసం గతంలోనే మున్సిపల్, మార్కెటింగ్ శాఖల ద్వారా నిధులు మంజూరయ్యాయి. నిర్మాణాల కోసం స్థలాలను సైతం గుర్తించారు. నాగర్‌కర్నూల్, కల్వకుర్తి మున్సిపాలిటీల్లో పనులు అసంపూర్తిగా నిలిచిపోగా.. కొల్లాపూర్, అచ్చంపేట మున్సిపాలిటీల్లో పనులు ప్రారంభానికి నోచుకోలేదు. కొన్నేళ్లుగా మార్కెట్ల నిర్మాణం ప్రకటనలకే పరిమితమవుతోంది.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

జిల్లాలో నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కొల్లాపూర్, కల్వకుర్తి మున్సిపాలిటీలుగా ఉన్నాయి. నాలుగు మున్సిపాలిటీల్లోనూ మోడ్రన్, ఇంటిగ్రేటెడ్ మార్కెట్లు లేవు. జిల్లాకేంద్రమైన నాగర్‌కర్నూల్‌లో గతంలో రైతుబజార్ నిర్మించగా.. కొంతకాలం మాత్రమే పూర్తిస్థాయిలో కూరగాయల విక్రయాలు సాగాయి. ఆ తర్వాత దీన్ని నాన్‌వెజ్ మార్కెట్‌గా తీర్చిదిద్దాలని అధికారులు నిర్ణయించారు. కొత్తగా వ్యవసాయ మార్కెట్‌యార్డులో మూడెకరాల స్థలంలో మోడ్రన్ మార్కెట్ నిర్మించేందుకు చర్యలు చేపట్టారు. మార్కెట్ నిర్మాణానికి మార్కెటింగ్ శాఖ రూ. 7కోట్లు కేటాయించింది. చాలాకాలంగా ఈ పనులు కొనసాగుతూనే ఉన్నాయి.

⇨ కొల్లాపూర్‌లో మోడ్రన్ మార్కెట్ నిర్మాణం కోసం 2018లో టీఎఫ్‌యూఐడీసీ ద్వారా రూ. 2కోట్లు కేటాయించారు. అప్పట్లో మార్కెట్ నిర్మాణానికి ప్రభుత్వ సివిల్ ఆస్పత్రి వెనకభాగంలో ఉన్న స్థలాన్ని గుర్తించారు. అయితే సాంకేతిక కారణాల వల్ల నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. తర్వాతి కాలంలో ఆర్డీఓ కార్యాలయ ప్రాంగణాన్ని పరిశీలించారు. అక్కడే మార్కెట్ నిర్మాణానికి అసెంబ్లీ ఎన్నికలకు ముందు భూమిపూజ చేయాలని భావించారు. అది కూడా ఆచరణకు నోచుకోలేదు. ఎన్నికల తర్వాత కూడా మున్సిపల్ అధికారులు స్థల పరిశీలన చేపట్టారు. కానీ పనులు మాత్రం ప్రారంభించలేదు.

⇨ అచ్చంపేటలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో కూరగాయల మార్కెట్ నిర్మించేందుకు మొదట స్థలాన్ని గుర్తించారు. ఆ తర్వాత ఇరిగేషన్ కార్యాలయ ప్రాంగణంలోకి దాన్ని మార్చారు. రూ. 2.5కోట్లు మార్కెట్ నిర్మాణానికి మంజూరు కాగా.. పనులు మాత్రం ప్రారంభం కాలేదు.

⇨ కల్వకుర్తి మున్సిపాలిటీలో పనులు ప్రారంభమై అసంపూర్తిగా మిగిలాయి. హైదరాబాద్‌కు వెళ్లే దారిలో గల మార్కెట్‌యార్డు స్థలంలో రూ. 4.50 కోట్ల వ్యయంతో నిర్మాణాలు ప్రారంభించారు. పనులు అసంపూర్తిగా ఉన్నాయి.

రోడ్లపైనే సాగుతున్న సంతలు..

నియోజకవర్గ కేంద్రాల్లో రైతు మార్కెట్లు లేకపోవడంతో సంతలు ప్రధాన రోడ్లపైనే సాగుతున్నాయి. నాగర్‌కర్నూల్‌లో ప్రతి శుక్రవారం జెడ్పీ హైస్కూల్ మైదానంలో సంత సాగుతుండగా.. మిగతా రోజుల్లో రోడ్లపైనే కూరగాయల విక్రయాలు కొనసాగుతున్నాయి. కొల్లాపూర్, అచ్చంపేట, కల్వకుర్తి పట్టణాల్లో ప్రతి ఆదివారం సంతలు నిర్వహిస్తున్నారు. మున్సిపాలిటీలతోపాటు ప్రధాన పట్టణాలు, మండల కేంద్రాల్లో కూడా ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ చిరు వ్యాపారులు, రైతులు రోడ్లపైనే కూరగాయలు విక్రయిస్తున్నారు. రోడ్లపై సంతలు సాగడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

అనువైన స్థలాన్ని గుర్తిస్తాం

కొల్లాపూర్‌లో ఇంటిగ్రేటెడ్ మోడ్రన్ మార్కెట్ నిర్మాణం కోసం అనువైన స్థలాన్ని గుర్తిస్తాం. గతంలో ప్రభుత్వ ఆస్పత్రి సమీపం లేదా ఆర్డీఓ కార్యాలయ ప్రాంగణంలో మార్కెట్ నిర్మాణం చేపట్టాలని అధికారులు భావించారు. అయితే ఆ స్థలాలు మార్కెట్ నిర్మాణానికి అనువుగా ఉంటుందా లేదా అనే అంశాలు పరిశీలనలో ఉన్నాయి. ఈ అంశంపై మంత్రి జూపల్లి కృష్ణారావు కూడా చర్చించారు. అనువైన స్థలాన్ని గుర్తించి పనులు చేపట్టాలని సూచించారు. ఈ దిశగా చర్యలు చేపడుతున్నాం.

– చంద్రశేఖర్‌రావు, మున్సిపల్ కమిషనర్, కొల్లాపూర్

రైతులకు ఇక్కట్లు..

జిల్లాలో నీటి వనరులు సమృద్ధిగా ఉండటంతో కూరగాయల సాగు పెరిగింది. అయితే రైతులు పండించిన పంట విక్రయానికి మార్కెట్లు అందుబాటులో లేకపోవడంతో.. చేసేది లేక అరకొర మొత్తానికి దళారులకు అమ్ముతున్నారు. కొందరు రోజువారీగా సంతలు జరిగే ప్రాంతాలకు తిరుగుతూ కూరగాయలు విక్రయిస్తున్నారు. మున్సిపాలిటీలు, మండల కేంద్రాల్లో మార్కెట్లు నిర్మిస్తే రైతులు పండించే కూరగాయలను స్థానికంగానే అమ్ముకునేందుకు వీలు కలుగుతుంది.

ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేట/అచ్చంపేట రూరల్/ఉప్పునుంతల: స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణ పిలుపునిచ్చారు. శనివారం అచ్చంపేట అంబేడ్కర్ ప్రజా భవన్‌లో ఉప్పునుంతల, అమ్రాబాద్ మండలాల కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు, ముఖ్య కార్యకర్తలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, అభ్యర్థుల ఎంపిక తదితరాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ కోసం కష్టపడే వారికే అవకాశాలు దక్కుతాయన్నారు. పార్టీ సూచించిన అభ్యర్థుల గెలుపు కోసం పనిచేయాలని, రిజర్వేషన్లపై అపోహలు నమ్మొద్దన్నారు. అభ్యర్థుల ఎంపిక పారదర్శకంగా ఉంటుందన్నారు. ఈ ఎన్నికల కోసం ప్రతి మండలం నుంచి 9నుంచి 12మందితో కోఆర్డినేషన్ కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. స్థానిక ఎన్నికలపై రాజకీయ పరిజ్ఞానం లేని వారు తప్పుడు ప్రచారం చేస్తున్నారని.. వారికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని అన్నారు. సమావేశంలో ఉప్పునుంతల మండల అధ్యక్షుడు కట్టా అనంతరెడ్డి, నాయకులు తిప్పర్తి నర్సింహారెడ్డి, వేముల నర్సింహారావు, అనంత ప్రతాప్‌రెడ్డి, లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

కష్టపడిన వారికే మొదటి ప్రాధాన్యం

- స్థానిక సంస్థల ఎన్నికల్లో అందరూ కీలకంగా వ్యవహరించాలి
- ఉమ్మడి జిల్లా నేతలతో ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ



మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజనర్సింహ, పక్కన మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి తదితరులు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లావ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించబోతోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం పట్ల ప్రజలు సానుకూలంగా ఉన్నారని చెప్పారు. శనివారం ఆయన ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలతో హైదరాబాద్‌లోని తన నివాసంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలు వీర్లపల్లి శంకర్, పర్ణికారెడ్డి, రాజేశ్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మేఘారెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి హాజరయ్యారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అవలంబించాల్సిన వ్యూహాలు, అభ్యర్థుల ఎంపిక, ప్రచార శైలి, ప్రజల్లోకి ప్రభుత్వ పథకాలను తీసుకెళ్లడం, ప్రతిపక్షాల విమర్శలకు ఎప్పటికప్పుడు ధీటుగా బదులివ్వడం, సోషల్ మీడియాలో జరిగే అసత్య ప్రచారాలను ఎదుర్కొని ప్రజలకు నిజాలు తెలియజేసే అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ కాంగ్రెస్ నేతలకు పలు సూచనలు చేశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ, పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు, నాయకులకు టికెట్ల కేటాయింపులో మొదటి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. టికెట్ల కేటాయింపు విషయంలో పార్టీ నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాలని, పార్టీ నాయకుల మధ్య సమన్వయలోపం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికి చేరేలా చూడాలన్నారు. సోషల్ మీడియా వేదికగా ప్రతిపక్షాలు చేస్తున్న తప్పుడు ఆరోపణలను బలంగా తిప్పికొడుతూ ప్రజలకు వాస్తవాలు తెలిపేలా కార్యకర్తలను సమాయత్తం చేయాలని మంత్రి సూచించారు.

ప్రతిపాదనలతోనే సరి!

కళాశాలల్లో అమలుకాని మధ్యాహ్న భోజన పథకం

- గతేడాది ప్రతిపాదనలు పంపిన ఇంటర్ విద్యాశాఖ
- నేటికీ ప్రభుత్వం నుంచి రాని స్పష్టత
- జిల్లాలోని 16 కళాశాలల్లో 13,872 మంది విద్యార్థులు



తాడూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల

నాగర్‌కర్నూల్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు ప్రతిపాదనలకే పరిమితమైంది. ప్రభుత్వ కళాశాలల్లో ఇంటర్ విద్య అభ్యసించేందుకు ఎంతో మంది విద్యార్థులు గ్రామీణ ప్రాంతాల నుంచి వస్తున్నారు. 5నుంచి 10 కిలోమీటర్ల దూరంలోని కళాశాలలకు సకాలంలో చేరుకునేందుకు ఉదయాన్నే ఇళ్ల నుంచి బయలుదేరుతున్నారు. ఈ క్రమంలో కొందరు విద్యార్థులు అల్పాహారం చేయడం కూడా గగనంగా ఉంటుంది. ఇక మధ్యాహ్న భోజనం తెచ్చుకోలేక.. బయట తినే ఆర్థిక స్తోమత లేక ఆకలి చూపులతో తరగతులు వినాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనూ మధ్యాహ్న భోజన పథకం అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం గతేడాది ప్రతిపాదనలు స్వీకరించింది. అయితే విద్యా సంవత్సరం చివరిలో ఈ ప్రతిపాదనలను సిద్ధం చేశారు. ఈ ఏడాది నుంచి కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తుందని అంతా భావించారు. కానీ ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటన రాకపోవడంతో ఈ సారి కూడా మధ్యాహ్న భోజనం అమలయ్యే సూచనలు కనిపించడం లేదు.

కార్యరూపం దాల్చక అవస్థలు..

2018లో అప్పటి ప్రభుత్వం అక్షయ ఫౌండేషన్ ద్వారా ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలని భావించినప్పటికీ కార్యరూపం దాల్చలేదు. ఆ తర్వాత 2021లోనూ మరో మారు ఈ ప్రయత్నం చేసినప్పటికీ ఆచరణకు నోచుకోలేదు. గతేడాది నుంచి ప్రభుత్వ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అందించాలని ప్రస్తుత ప్రభుత్వం ప్రతిపాదనలు సేకరించినా.. కార్యరూపం దాల్చలేదు. కాగా, ఒక్కో విద్యార్థికి రూ.20 నుంచి రూ.25 ఖర్చవుతుందని అధికారులు వెల్లడిస్తున్నారు. ఈ మేరకు గతేడాది జిల్లాలో ఎంత మంది విద్యార్థులు ఉన్నారు.. ఒక్కో విద్యార్థికి ఎంత ఖర్చవుతుందనే విషయంపై ప్రతిపాదనలు సిద్ధంచేసి ప్రభుత్వానికి పంపించారు. దీనిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

హాజరు శాతం పెరిగే అవకాశం..

జిల్లాలో 16 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా.. ప్రథమ సంవత్సరంలో 6,483 మంది, ద్వితీయ సంవత్సరంలో 6,823 మంది విద్యార్థులు ఇంటర్ విద్య అభ్యసిస్తున్నారు. ఆయా కళాశాలలకు ఎక్కువ శాతం సమీప గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులే అధికం. వారంతా రోజు దూర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో డ్రాపౌట్లు కూడా పెరుగుతున్నాయి. ఈ ప్రభావం ఇంటర్ ఉత్తీర్ణత శాతంపై పడుతుంది. ఇదిలా ఉంటే, ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం ప్రారంభించిన తర్వాతే హాజరు శాతం పెరిగింది. ఇదే ఫార్ములాను కళాశాలల్లో ప్రయోగిస్తే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అంతే కాకుండా పరీక్షల సమయంలో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా కళాశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తుంటారు. దీంతో గ్రామీణ విద్యార్థులు మరిన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలుచేస్తే దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు మేలు చేకూరనుంది.

ఆదేశాలు రాలేదు..



ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలనే ప్రతిపాదనలు ఉన్నాయి. దీనిపై ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. ఒక్కో విద్యార్థికి ఎంత కేటాయిస్తారు.. ఎప్పటి నుంచి ప్రారంభిస్తారనే విషయాలు తెలియదు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే వాటిని అమలుచేస్తాం.

– వెంకటరమణ, ఇంటర్మీడియట్ నోడల్ ఆఫీసర్

క్లుప్తంగా

బారికేడ్‌ను ఢీకొని యువకుడి దుర్మరణం


కురుమూర్తి(ఫైల్)

మరికల్: హోటల్ పనులు ముగించుకొని తిరుగు ప్రయాణంలో బైక్‌పై ఇంటికి వస్తుండగా బారికేడ్‌ను ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన అర్ధరాత్రి మరికల్‌లో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని మాధవరం గ్రామానికి చెందిన కురుమూర్తి(29) మూడు నెలల క్రితం మరికల్‌లోని రాయచూర్ రోడ్డు పక్కన నాటుకోడి హోటల్ పెట్టి జీవనం కొనసాగిస్తున్నాడు. దసరా పండుగ కావడంతో రాత్రి వరకు హోటల్ నడిపించాడు. హోటల్ పనులు ముగించుకొని బైక్‌పై మాధవరం వస్తున్నాడు. సబ్‌స్టేషన్ చౌరస్తాలో ప్రమాదాలను నివారించేందుకు పెట్టిన బారికేడ్‌ను వేగంగా వచ్చి ఢీకొనడంతో కిందపడి తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు అదే గ్రామానికి చెందిన యువతితో 5ఏళ్ల క్రితం వివాహం జరగా.. ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించామని ఎస్‌ఐ రాము తెలిపారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి


చెన్నయ్య(ఫైల్)

అడ్డాకుల: మండలంలోని శాఖాపూర్‌కు చెందిన వ్యక్తి పండుగ పూట చేపల వేటకు వెళ్లి మృత్యువాతపడ్డాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన ఆకుల చెన్నయ్య (35), ఈదమ్మ దంపతులకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. చెన్నయ్య గ్రామంలోనే కూలీ పనులు చేసి జీవనం సాగిస్తున్నాడు. దసరా పండుగ సందర్భంగా శుక్రవారం ఉదయం చేపల వేటకు గ్రామ సమీపంలోని చెరువు వద్దకు వెళ్లాడు. మధ్యాహ్నమైనా చెన్నయ్య ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చెరువు వద్ద వెతకగా ఆచూకీ లభించలేదు. ఈ క్రమంలో శనివారం ఉదయం చెరువులో చెన్నయ్య మృతదేహం తేలడంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. బాధిత కుటుంబ సభ్యులు సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రికి తరలించారు. చెన్నయ్య ఫిట్స్‌తో ఇబ్బంది పడేవాడని చెరువులోకి దిగిన తర్వాత ఫిట్స్ రావడంతో నీళ్లల్లో మునిగి చనిపోయి ఉంటాడని బంధువులు భావిస్తున్నారు.

ఫాంపాండ్‌లో పడి బాలుడు మృతి

అచ్చంపేట రూరల్: ప్రమాదవశాత్తు పొలంలోని ఫాంఫండ్‌లో పడి బాలుడు మృతి చెందిన ఘటన శనివారం మండలంలోని దర్గాతండాలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. దర్గాతండాకు చెందిన అరుణ కుమారుడు నిహాల్(5)ను తీసుకొని పొలం వద్దకు వెళ్లింది. పొలం పనుల్లో ఉండగా నిహాల్ ఆడుకుంటూ పక్కనే ఉన్న ఫాంఫండ్ వద్దకు వెళ్లి కాలుజారి నీటిలో పడి అక్కడికక్కడే మృతి చెందాడు. బాలుడి మృతిపై ఎలాంటి కేసు నమోదు కాలేదని అచ్చంపేట పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


సత్తయ్య(ఫైల్)

కొల్లాపూర్: విద్యుదాఘాతంతో ఒకరు మృతి చెందిన ఘటన పట్టణంలోని వరిదేల హనుమాన్ ఆలయ సమీపంలో శనివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన సంగనమోని సత్తయ్య(58) ఇంటి వద్ద పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యాదాఘాతానికి గురయ్యాడు. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడికి కుటుంబాన్ని పలువురు నాయకులు పరామర్శించారు.

షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం

పాన్‌గల్: మండలంలోని కేతేపల్లి గ్రామానికి చెందిన గడమాల కుర్మయ్యకు చెందిన గుడిసె శనివారం షార్ట్ సర్క్యూట్‌కు గురై దగ్ధమైంది. గుడిసెలో గ్యాస్ సిలిండర్ ఉందని ఇంటి యజమాని చెప్పడంతో చుట్టు పక్కల నివాస గృహాల వారు సిలిండర్ ఎక్కడ పేలుతుందోనని భయాందోళనకు గురయ్యారు. వెంటనే జిల్లా కేంద్రంలోని ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో ఫైర్ ఇంజిన్ సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేయడంతో పెను ప్రమాదం తప్పింది. ఫైర్ ఇంజిన్ వచ్చే లోపు గ్రామస్తులు, యువకులు మంటలు చుట్టు పక్కల వ్యాపించకుండా నీళ్లు చల్లుతూ కొంత మేర అదుపు చేశారు. అయితే ఈ ప్రమాదంలో ఇంటి నిర్మాణం కోసం దాచిన రూ.లక్ష నగదు, రెండు క్వింటాళ్ల బియ్యం, దుస్తులు, వంట సామగ్రి మంటల్లో కాలి బూడిదయ్యాయి. దాదాపుగా రూ.2 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. ప్రభుత్వమే తనను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశాడు.



తిరుగు ప్రయాణ పాట్లు


జడ్చర్లలోని నేతాజీ చౌరస్తాలో బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు


ఉండవెల్లి మండలం అలంపూర్ చౌరస్తాలో ఇలా

దసరా పండుగ, సెలవులు ముగియడంతో స్వగ్రామాలకు వెళ్లిన వారంతా తిరిగి పట్నం బాట పట్టారు. శుక్రవారంతోనే దసరా సెలవులు ముగియడంతో శనివారం కార్యాలయాలకు వెళ్లే వారితోపాటు, సోమవారం నుంచి విద్యాసంస్థలు తెరుచుకోనుండగా హాస్టళ్లకు వెళ్లాల్సిన విద్యార్థులను పంపేందుకు ఉదయం నుంచే తల్లిదండ్రులు బయలుదేరారు. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా బస్టాండ్లు, పట్టణాల్లోని ప్రధాన కూడళ్లు, ప్రయాణికులతో రద్దీగా మారాయి. ప్రధానంగా హైదరాబాద్ రూట్‌లో వెళ్లే బస్సుల కోసం ప్రయాణికులు గంటల తరబడి ఎదురుచూడాల్సి వచ్చింది. జడ్చర్ల మున్సిపాలిటీలోని బాదేపల్లి సిగ్నల్‌గడ్డ, ఫ్లెఓవర్ సర్కిల్, బస్టాండ్ ప్రయాణికులతో కిటకిటలాడాయి. బస్సులు వచ్చిన వెంటనే సీట్ల కోసం ప్రయాణికులు పోటీపడటం కనిపించింది. ఇదిలా ఉండగా.. అలంపూర్ చౌరస్తాలో ప్రజలు ఎండలోనే బస్సుల కోసం ఎదురుచూడాల్సి వస్తుంది. అలంపూర్ ఆలయాలకు రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి ప్రజలు ఎక్కువగా వస్తుంటారు. ఈ క్రమంలో అధికారులు స్పందించి ఇక్కడ మినీ బస్టాండ్ ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. – జడ్చర్ల టౌన్/ ఉండవెల్లి


జడ్చర్ల కొత్త బస్టాండ్‌లో హైదరాబాద్ వెళ్లే బస్సు ఎక్కేందుకు గుమిగూడిన ప్రయాణికులు

జూరాలకు 2.32 లక్షల క్యూసెక్కుల వరద


శ్రీశైలంలో ఎనిమిది గేట్ల ద్వారా దిగువకు విడుదల అవుతున్న నీరు

- ప్రాజెక్టు 11 క్రస్టు గేట్లు ఎత్తివేత
- 2.11 లక్షల క్యూసెక్కుల నీటి విడుదల

ధరూరు/ఆత్మకూర్: ఎగువ నుంచి ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వస్తున్న ఇన్‌ఫ్లో స్వల్పంగా తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. శుకవారం రాత్రి 9 గంటల వరకు ప్రాజెక్టుకు 2.70 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. శనివారం రాత్రి 8 గంటల వరకు 2.32 లక్షల క్యూసెక్కులకు తగ్గినట్లు పేర్కొన్నారు. దీంతో ప్రాజెక్టు 11 క్రస్టు గేట్లు ఎత్తి 1.74 లక్షల క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఆరు యూనిట్లలో 234 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేస్తూ 30,422 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 68 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 1,030 క్యూసెక్కులు, కుడి కాల్వకు 390 క్యూసెక్కులు, భీమా లిఫ్టు-2కు 750 క్యూసెక్కులు కలిపి ప్రాజెక్టు నుంచి మొత్తం 2.11 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువన శ్రీశైలం ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 8.690 టీఎంసీల నీరు నిల్వ ఉంది. నారాయణపూర్ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 37.64 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 33.173 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టుకు 45వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 7గేట్లను ఎత్తి దిగువన ఉన్న జూరాలకు ప్రాజెక్టుకు 38,480 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జూరాల ఎగువ, దిగువ జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో ఇప్పటి వరకు 749.051 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేపట్టినట్లు ఎస్‌ఈ శ్రీధర్ తెలిపారు.

రెండ్లు గేట్ల ద్వారా..

రాజోళి: సుంకేసుల డ్యాంలో రెండు గేట్ల ద్వారా నీటి విడుదల చేస్తున్నట్లు జేఈ మహేంద్ర తెలిపారు. శనివారం ఎగువ నుంచి 13,300 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. రెండు గేట్లను ఒక మీటర్ మేర తెరిచి 8,821 క్యూసెక్కులు, కేసీ కెనాల్‌కు 2,445 క్యూసెక్కులను వదిలినట్లు ఆయన పేర్కొన్నారు.

రామన్‌పాడులో 1,021 అడుగుల నీటి మట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో పూర్తిస్థాయి నీటిమట్టం 1,021 అడుగులకు గాను శనివారం 1,021 అడుగులు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వార 974 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సమాంతర కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపి వేశారు. ఎన్టీఆర్ కాల్వ ద్వారా 875 క్యూసెక్కులు, కుడి ఎడమ కాల్వ ద్వారా 50 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ వరప్రసాద్ తెలిపారు.

శ్రీశైలంలో ఎనిమిది గేట్లు ఎత్తివేత

దోమలపెంట: ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న నీటి ప్రవాహం కొంత తగ్గుముఖం పట్టడంతో శ్రీశైలం ఆనకట్ట వద్ద ఎత్తి ఉంచిన పది గేట్లలో శనివారం రెండు గేట్లను మూసి వేసి ఎనిమిది గేట్ల ద్వారా నీటిని సాగర్‌కు విడుదల చేస్తున్నారు. జూరాల నుంచి 2.11 లక్షల క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 17,916, హంద్రీ నుంచి 250 మొత్తం 2,27,822 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలం జలాశయానికి చేరుతోంది. శ్రీశైలంలో ఆనకట్ట వద్ద ఎనిమిది గేట్లు ఒకొక్కటి పది అడుగుల మేర పైకెత్తి స్పిల్‌వే ద్వారా 2,21,664 క్యూసెక్కులు, కుడి, ఎడమ విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తూ 65,976 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 884.2 అడుగుల వద్ద 210.9946 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఇరవై నాలుగు గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 5 వేలు, హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 2,817 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భూగర్భ కేంద్రంలో 16.974 మిలియన్ యూనిట్లు, ఏపీ జెన్కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో 15.317 మి.యూనిట్ల విద్యుదుత్పత్తి చేశారు.


జూరాల క్రస్టు గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

జోగుళాంబ సన్నిధిలో భక్తుల రద్దీ


జోగుళాంబ దేవి దర్శనార్థం క్యూలైన్లలో నిల్చున్న భక్తులు

అలంపూర రూరల్ : అష్టాదశ శక్తిపీఠాల్లో ఐదవ శక్తిపీఠం నవ బ్రహ్మలయాల దివ్యధామం అలంపూర్ క్షేత్రంలో భక్తుల రద్దీతో కిక్కిరిసింది. శనివారం భక్తులు పెద్ద ఎత్తున బారులు తీరారు. గంటలపాటు క్యూలైన్లలో నిల్చొని అమ్మవారిని దర్శించుకొన్నారు. ప్రముఖ సినీ సంగీత దర్శకుడు మణిశర్మ కుటుంబ సభ్యులతో ఆలయాలను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.


జోగుళాంబ సన్నిధిలో సంగీత దర్శకుడు మణిశర్మ

దాడిచేసిన వారిపై కేసు నమోదు

అమరచింత: నాగల్‌కడ్మూర్ గ్రామానికి చెందిన అహ్మద్‌పాషాపై దాడి చేసిన నాగిరెడ్డిపల్లెకు చెందిన పలువురిపై శనివారం కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ స్వాతి తెలిపారు. శుక్రవారం రాత్రి నాగల్‌కడ్మూర్‌కు చెందిన అహ్మద్‌పాషా తన సొంత పనులు ముగించుకుని ఇంటికి వస్తున్నాడు. అంబేద్కర్ చౌరస్తా వద్ద నారాయణపేట మండలం నర్వ మండలం నాగిరెడ్డిపల్లెకు చెందిన కొంతమంది యువకులు నాగల్‌కడ్మూర్‌కు చెందిన చిన్నపిల్లలతో గొడవ పడుతుండగా వారించడానికి వెళ్లిన అహ్మద్ పాషాపై కత్తితో దాడిచేసి గాయపరిచారన్నారు. దీంతో పెద్దగా అరవడంతో సమీపంలో ఉన్న వ్యక్తులు అక్కడికి రాగా దాడికి పాల్పడిన వారు అక్కడినుంచి పరారయ్యారన్నారు. రక్తగాయంతో బాధపడుతున్న పాషాను ఆత్మకూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మొసళ్ల సంచారంతో ఆందోళన



వీపనగండ్ల: మండలంలోని రిజర్వాయర్, పలు చెరువులు, కుంటల్లో మొసళ్ల సంచారంతో ఆందోళన చెందుతున్నట్లు రైతులు వాపోతున్నారు. శుక్రవారం రాత్రి కల్వరాల్ల గ్రామ సమీపంలో రోడ్డుపై మొసలి సంచరిస్తుండటాన్ని గుర్తించారు. అదే విధంగా గోపల్‌దిన్నె రిజర్వాయర్, గోవర్ధనగిరికత్వా, పల్లెచెరువు పలు గ్రామాల్లోని ఊరచెరువులో తరచూ మొసళ్లు దర్శనమిస్తున్నాయని తెలిపారు. అధికారులు స్పందించి ఆయా చెరువుల వద్ద హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

శ్రీశైలం ట్రస్టు బోర్డులోకి కట్టా సుధాకర్‌రెడ్డి



అచ్చంపేట: శ్రీశైలం దేవస్థానం ట్రస్టు బోర్డు ప్రత్యేక ఆహ్వానితులు గా ఉప్పునుంతల మండల కేంద్రానికి చెందిన కట్టా సుధాకర్ రెడ్డిని నియమిస్తూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన ప్రస్తుతం తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా కొనసాగుతున్నారు. ఏబీవీపీ, బీజేపీలో కీలకంగా పనిచేస్తున్న ఆయనకు అవకాశం రావడంపై నల్లమల్ల ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శ్రీశైలం బోర్డులో అచ్చంపేట ప్రాంతానికి అవకాశం కల్పించాలని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ శ్రీశైలం డ్యాం గేట్లు ఎత్తేందుకు వచ్చిన ఏపీ సీఎం చంద్రబాబునాయుడుకు విన్నవించారు. వారం రోజుల క్రితం అమరావతిలో కలిసి కూడా వినతిపత్రం అందజేశారు. మొదటిసారి అచ్చంపేట ప్రాంతానికి అవకాశం దక్కింది.

కారు, బైక్ ఢీ.. వ్యక్తికి తీవ్రగాయాలు

కొత్తకోట రూరల్: కారు, బైక్ ఢీకొని బైక్‌పై వెళ్తున్న వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన మండలంలోని కనిమెట్ట గ్రామ సమీపంలో ఎన్‌హెచ్-44పై శుక్రవారం రాత్రి చోటు చేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కానాయపల్లి గ్రామానికి చెందిన నరేందర్ పెద్దమందడి మండలంలోని మోజర్ల గ్రామంలో బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తుండగా కనిమెట్ట సమీంలో ఫుడ్ పిరమిడ్ దగ్గర హైదరాబాద్ వైపు నుంచి కర్నూల్ వైపు వెళ్తున్న కారు డ్రైవర్ సడెన్‌బ్రేక్ వేయడంతో బైక్ కారును వెనుక నుంచి ఢీకొనడంతో బైక్‌పై ఉన్న నరేందర్ రోడ్డుపై కిందపడటంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. అక్కడే సమీపంలో ఉన్న కనిమెట్ట గ్రామస్తులు క్షతగాత్రుడిని 108లో వనపర్తి ఆసుపత్రికి తరలించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ ఆనంద్ తెలిపారు.

బాలికపై లైంగిక దాడి.. పోక్సో కేసు నమోదు

ఆత్మకూర్: అభం శుభం తెలియని ఓ బాలికను మాయమాటలతో లోబర్చుకొని తల్లిని చేసిన కామాంధుడిపై పోక్సో కేసు నమోదైంది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన ఆత్మకూర్ మండలంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ నరేందర్ తెలిపిన వివరాలిలా.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను అదేగ్రామానికి చెందిన వివాహితుడు మాయమాటలు చెప్పి పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. 15 ఏళ్ల ఆ బాలిక గర్భం దాల్చింది. తల్లిదండ్రులకు చెప్పకుండా దాచిపెట్టింది. నాలుగు రోజులక్రితం ప్రసవ నొప్పులతో అల్లాడిపోతుంటే గమనించిన కుటుంబసభ్యులు నిలదీయగా జరిగిన విషయం చెప్పింది. ఈ క్రమంలో బాలికకు మగ శిశువు జన్మించి మరణించడంతో తల్లిదండ్రులు గుట్టుచప్పుడు కాకుండా శిశువును చెరువు వద్ద పూడ్చిపెట్టారు. బాలికకు తీవ్ర రక్తస్రావం కావడంతో ఆత్మకూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. విషయం తెలుసుకున్న వైద్యులు సమాచారాన్ని పోలీసులకు అందించారు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు సదరు కామాంధుడిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ నరేందర్ తెలిపారు.

ఇసుక తరలింపు గొడవలో రైతుపై దాడి


రామకృష్ణారెడ్డి

వీపనగండ్ల: మండలంలోని తూంకుంట గ్రామ సమీపంలోని ఇసుక రీచ్ నుంచి శనివారం సాయంత్రం అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను రైతు అడ్డగించి తన పంట పొలంలో వెళ్లొద్దని చెప్పడంతో ఆగ్రహించిన ట్రాక్టర్ యజమాని రైతుపై దాడి చేసి గాయపరిచిన ఘటన శనివారం చోటు చేసుకుంది. వివరాలు.. తూంకుంట గ్రామానికి చెందిన చిన్న రాంబాబు అనే ట్రాక్టర్ యజమాని అదే గ్రామానికి చెందిన పోతుల రామకృష్ణారెడ్డి పొలం నుంచి ఇసుకను తరలిస్తున్నాడు. దీంతో రైతు ట్రాక్టర్ అడ్డుకొని తన పొలం గుండా రావొద్దని చెప్పడంతో ఆగ్రహించిన ట్రాక్టర్ యజమాని రైతుపై దాడి చేసి గాయపరిచారు. ఇసుక రీచ్‌కు అతి సమీపంలో దాదాపు 100 మంది రైతుల మోటార్లు ఉన్నాయని, యథేచ్ఛగా ఇసుకను తరలిస్తుండడంతో బోరుబావులు అడుగంటి పోతాయన్న విషయాన్ని ఇసుక అక్రమ తరలింపుదారులకు చెప్పినా పట్టించుకోవడంలేదని బాధితుడు వాపోయారు. తనపై దాడి చేసిన వ్యక్తిపై చట్టరీత్యా చర్య తీసుకోవాలని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. ఫిర్యాదు అందుకున్న ఎస్‌ఐ కె.రాణి విచారణ చేసి కేసు నమోదు చేయనున్నట్లు తెలిపారు.

మద్దూరులో బైక్ బ్యాటరీల చోరీ



మద్దూరు: ఇళ్లు, దుకాణాల ఎదుట ఉంచిన ద్విచక్ర వాహనాల బ్యాటరీలను ఓ మెకానిక్ శుక్రవారం రాత్రి దొంగలించిన ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. ఓ షాపు ఎదుట ఉన్న సీసీ పుటేజీలో బైక్ నుంచి బ్యాటరీ చోరీ చేయడం రికార్డు అయ్యింది. అలాగే ఒకే రాత్రి దాదాపు 18బైక్‌ల నుంచి బ్యాటరీలు అపహరించడం కలకలం రేపింది. దీంతో రఘు అనే వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ఎస్‌ఐ విజయ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మద్దూరులో మెకానిక్ షాపు నిర్వహించే నర్సింహులు ఈ దొంగతనం చేసినట్లు గుర్తించి అతని మెకానిక్ షాపు నుంచి దొంగిలించిన 18 బ్యాటరీలను రికవరీ చేసినట్లు తెలిపారు. నర్సింహులు పరారీలో ఉన్నట్లు తెలిపారు. అతన్ని పట్టుకొని విచారించిన తర్వాత వివరాలు వెల్లడించనున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ద్రావణ తయారీలో నాణ్యత తప్పనిసరి


మందు పిచికారీ చేస్తున్న రైతు

పాడి-పంట
జిల్లా వ్యవసాయాధికారి, సక్రియానాయక్

అలంపూర్: పంట సస్యరక్షణ చర్యల్లో భాగంగా పురుగు మందు ద్రావణ తయారీలో నాణ్యత లోపించిన నీరు వాడితే ప్రతికూల మార్పులు జరిగి మందు ప్రభావం తగ్గుతుందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియనాయక్ రైతులకు సూచించారు. నాణ్యత లేని నీటిని వినియోగిస్తే నష్టపోతారన్నారు. మందు ద్రావణం చేయడానికి నాణ్యత గల నీరు వాడినప్పుడే మాత్రమే మందు శక్తివంతంగా పని చేసి ఫలితం పొందవచ్చని పేర్కొన్నారు.

ఎలాంటి నీరు కావాలి..? ఏ లక్షణాలు ఉండాలి..?

మందు ద్రావణ తయారీకి ముఖ్యంగా మూడు లక్షణాలు ఉండాలి. వీటిపై సరైన అవగాహన పెంచుకోవాలి.

1. పీహెచ్ ఉదజని సూచిక లేక రసాయన స్థితి :

నీటిలో కరిగి ఉండే లవణాల స్వభావంపై ఆధార పడి ఉంటుంది. ఇది ఆమ్లం, తటస్థం, క్షారముగా ఉండవచ్చు. అయితే ఆమ్లగుణ తీవ్రత అధికంగా లేదా క్షారగుణ తీవ్రత అధికంగా ఉన్న నీటిని మందు ద్రావణం తయారు చేయడానికి ఉపయోగించ రాదు. దీని వలన రసాయన ప్రతికూల మార్పులు ఏర్పడతాయి.

2. సెలినిటీ లేక సాల్ట్ కంటెంట్ (లవణ పరిమాణ సూచిక)

అన్ని రకాల నీటిలోను కొన్ని లవణాలు కరిగి ఉంటాయి. కొన్నింటిలో ఎక్కువగానూ కొన్నింటిలో తక్కువగాను ఉండవచ్చు. లవణాలు ఎంత తక్కువగా ఉంటే అంత మంచి నీరుగా భావించాలి. లవణాలు అధికంగా ఉన్న నీరు మందు ద్రావణంలో కలపడానికి పనికిరావు.

3. నీటి కాఠిన్యత :

నీటిలో ఉండే లవణాల స్వభావాన్ని బట్టి వరస్పర అధికృతను బట్టి నీటిని రెండు రకాలుగా విభజించవచ్చు.

సాఫ్ట్ వాటర్(మృదుజలం): సబ్బుతో సులభంగా నురగ వస్తుంది. దీంతో ఏ సమస్య ఉండదు. మందు ద్రావణ తయారీకి నిరభ్యంతరంగా వాడుకోవచ్చు.

హార్డ్ వాటర్ (కఠిన జలం): ఇందులో బై కార్బోనేట్స్, క్లోరైడ్స్, సల్ఫేట్లకు సంబంధించిన కాల్షియం, మెగ్నీషియం లవణాలు అధికంగా ఉంటాయి. ఈ నీటిలో సబ్బు వినియోగించనప్పుడు నురగ రాదు. నీరు విరిగిపోయినట్లు కనిపిస్తుంది. నురగ బాగా రావడానికి అధిక పరిమాణంలో సబ్బు వాడాల్సి వస్తుంది. ఈ నీటిని మందు ద్రావణ తయారీకి వాడినప్పుడు కూడా ఇదే పరిస్థితి ఎదురవుతుంది. రసాయన ప్రతికూల చర్య జరగడం వలన ద్రావణం విరిగిపోవడం గమనించవచ్చు. దీని వల్ల మందు క్రిమి సంహారక గుణం క్షీణిస్తోంది.

ఊకచెట్టువాగులో మృతదేహం లభ్యం

మదనాపురం: సరళాసాగర్ ఊకచెట్టు వాగులో శుక్రవారం చేపల వేటకు వెళ్లిన శేఖర్ ప్రమాదవశాత్తూ నీటిలో పడి మృతి చెందాడు. శనివారం ఉదయం ఎన్డీఆర్‌ఎఫ్ అండ్ రెస్క్యూ బృందాలు వెలికితీసేందుకు చర్యలు చేపట్టగా ఎట్టకేలకు మృతదేహం లభ్యమైంది. అనంతరం పంచనామా నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

బైకులపైకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు



వనపర్తిటౌన్: వనపర్తి ఆర్టీసీ బస్టాండ్‌లో ఆగి ఉన్న డీలక్స్ బస్సు అకస్మాత్తుగా ముందుకు కదలడంతో ప్రయాణికులు తీవ్రభయాందోళనకు లోనయ్యారు. ఓ డీలక్స్ బస్సు శనివారం ఉదయం హైదరాబాద్ వెళ్లేందుకు వనపర్తి ఆర్టీసీ బస్టాండ్‌లో ఆగింది. పలువురు ప్రయాణికులు ఎక్కగా డ్రైవర్ టికెట్‌లు ఇస్తుండగా బస్సు దానంతట అదే ముందుకు కదిలింది. ఈ క్రమంలో బస్సు ముందు ఉన్న ప్రయాణికులు ఒక్కసారిగా పరిగెత్తారు. దీంతో అక్కడే ఆగి ఉన్న రెండు బైకులపైకి బస్సు దూసుకెళ్లడంతో అవి ధ్వంసమయ్యాయి. డ్రైవర్ వెంటనే అప్రమత్తమై బస్సును అదుపు చేయడంతో ప్రాణాపాయం తప్పింది. బస్సులో సాంకేతిక కారణాల వల్లే ఇలా జరిగిందని ఆర్టీసీ సిబ్బంది చెబుతుండగా డిపో మేనేజర్ దేవేందర్ గౌడ్ డ్రైవర్ హ్యాండ్ బ్రేక్ వేయకపోవడంతోనే సమస్య తలెత్తిందని తెలిపారు. డ్రైవర్‌కు కౌన్సిలింగ్ ఇచ్చామని వాహనదారులు కూడా బస్టాండ్‌లో బైకులు ఆపడం సరికాదని సూచించారు. ఘటనపై పోలీసులు ఆరా తీసినట్లు డిపో అధికారులు తెలిపారు.